# అమ్మ ఆవేదన

"చివరి క్షణాలు దగ్గర పడ్డాయి. ఇక బ్రతకను మీనాక్షీ! పిల్లలందర్నీ పిలిపించవూ? కడసారి వాళ్ళందర్నీ చూసి కనుమూయాలనుంది." చిక్కి శల్యమై మంచంపై నిస్త్రాణంగా పడి వున్న గంగాధరం కంఠం సన్నంగా వణికింది.

అతడి చూపుల్లో జీవం లేదు. చిరిగిన పుస్తకపు చివరి సంపుటిపై అలుక్కుపోయిన అక్షరాకృతిలా ఉందతని స్థితి.

పక్కనే కూర్చొని ఉందతని జీవన సహచరి. వార్ధక్యం ముసిరిన హరివిల్లులా ఉందామె వదనం. పదే పదే భర్త అదేపనిగా పిల్లల్ని చూడాలనుందంటుండడంతో 'అలాగే' నంటూ దుఃఖాన్ని చీరకొంగుతో అదిమి పెడుతూ లాండ్‌ఫోన్ దగ్గరకు కదిలింది బరువెక్కిన హృదయంతో.

పెద్దకొడుకు నరేష్‌కి ముందుగా డయల్ చేసింది. అతడు కరీంనగర్‌లో ఉంటున్నాడు. అవతలనుండి ఫోన్ ఎత్తిన చప్పుడు.

"హలో ! ఎవరూ... నరేషా ?"

"అవునమ్మా ! అంతా కులాసా"

"నాన్నగారి ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తోంది బాబూ !"

"వయసు పైబడుతోంది. డెబ్బయి ఏళ్ళు వచ్చాయి కదమ్మా. అనారోగ్యం సహజం."

"ఆయన మనకి దక్కేలా లేడు బాబూ! ఒక్కసారి మిమ్మల్ని చూడాలంటున్నారా...

తక్షణం బయల్దేరి రావూ!?"

"అమ్మో! ఈ రోజా ? కుదరదమ్మా ! నాకు రెండు మూడు ఏజెన్సీలున్నాయని తెలుసుకదా, కంపెనీ ఆఫర్ మీద ఈ సాయంత్రమే సింగపూర్‌కి బయల్దేరుతున్నాను. అందుకునే రెడీ అవ్వాలి, వారం రోజుల టూర్... వెళ్ళొచ్చాక వస్తాలే!"

"అది కాదురా..."

"ఇలాంటి చాన్స్‌లు అరుదుగా వస్తాయమ్మా! బిజినెస్ టర్నోవర్‌ని బట్టి. అందుకని మిస్ కావడం నాకిష్టం లేదు. అయినా నేనొక్కడ్నీ రాకపోతేనేం... తమ్ముళ్ళున్నారుగా, ధైర్యంగా ఉండు, ఉంటా." ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండానే ఫోన్ పెట్టేసిన చప్పుడు.

మీనాక్షమ్మ పెదవులు వణికాయి.

గతం గుర్తుకు వచ్చిందామెకు.

నరేష్‌కి పన్నెండేళ్ళ వయసప్పుడు-

"బాబుకి జ్వరం తీవ్రంగా ఉందండీ. డాక్టర్‌కి చూపెట్టాను. టెస్ట్‌లు చేశారు. టైఫాయిడ్ అని రిపోర్ట్ వచ్చింది." స్కూల్లో డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన గంగాధరానికి విషయం చెప్పింది మీనాక్షమ్మ.

"మందులు వేసావా ?" ఆత్రుతగా కొడుకు నుదుటి మీద చేయివేసాడు. ఆప్యాయంగా తల నిమిరాడు.

"వేసానండి. అది సరే... ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకొనేది రేపేగా, ఎప్పుడు బయల్దేరుతున్నారు?" అడిగింది మీనాక్షమ్మ భర్తను.

"ఈ..." ఏదో చెప్పబోయాడు.

అంత జ్వరంలోనూ మూసిన కన్ను తెరవని నరేష్ నోటి వెంట "నాన్నా! నాన్నా !" అని పలవరింపు వినిపించింది.

చప్పున బాబు వైపు తిరిగాడు. ఆ కుర్రాడి కనురెప్పలు వాలే ఉన్నాయి.

భార్య వంక చూస్తూ "ప్రోగ్రామ్ క్యాన్సిల్ చేసుకున్నాను మీనాక్షీ" అన్నాడు పొడిగా.

"అదేంటండీ !..."

"అదిగో బాబు వాలకం చూడు, నన్నే కలవరిస్తున్నాడు. స్కూల్ నుండి నే రావడం గంటాలస్యమైతే "నాన్నింకా రాలేదా" అంటూ నీ వెంటపడే బాబుని ఈ స్థితిలో వదిలి నేను అవార్డుకి వెళ్ళడమా? వెళ్ళను లక్ష్మీ. మనల్ని అమ్మానాన్నల్ని చేసిన తొలి సంతానం వీడు. బాబు ఆరోగ్యంకన్నా నాకే అవార్డు గొప్పేంకాదు కదా!" అంటున్న భర్తని ఆరాధనగా చూసిందామె.

గంగాధరం ఒక నిర్ణయం తీసుకున్నాడంటే దానికి తిరుగుండదు. అందుకే ఆ విషయాన్ని రెట్టించలేదు మీనాక్షి.

అలాంటి తండ్రిని అవసానదశలో ఆదరించడం కాదు... కనీసం చూసి పొమ్మంటే... టూర్‌కి బయల్దేరి వెళ్తున్నాడా కొడుకు.

'అలాంటి మంచి మనిషికి ఎటువంటివాడివి పుట్టావురా? హే భగవాన్!" ఒక గాఢమైన నిట్టూర్పు ఆమె గుండెలనుండి విడివడింది.

తేరుకొని నిజామాబాద్‌లోని రెండవ అబ్బాయి సురేష్‌కి రింగిచ్చింది.

"అమ్మా! ఏంటీ నువ్వింకా ఫోన్లు చేస్తూ కూర్చున్నావేం. బయల్దేరలేదా?" అంటూ ప్రశ్నించాడతను.

అబ్బాయికేం చెప్పాలో మీనాక్షికి తోచలేదు. తెల్లవారితే గృహప్రవేశ కార్యక్రమం చేసుకోబోతున్నాడతను!

"నాన్నగారు మిమ్మల్ని చూడాలని కలవరిస్తున్నార్రా" అని మాత్రం అనగలిగింది.

"అబ్బా! నాన్నగారి చాదస్తమింకా పోవటం లేదేంటమ్మా. వయసు మీద పడుతున్నా మనిషి మాత్రం మారడంలేదు. మేమేదో అమెరికా వెళ్ళినట్టు మీరేమో ఇండియాలోనే ఉన్నట్టు. మేం ఉంటున్నది పక్క జిల్లాలోనే కదా. ఫోన్ల సౌకర్యం ఉండనే ఉంది. అది సరే! నిన్ననే ఇద్దర్నీ బయల్దేరి రమ్మన్నానుగా"

"వద్దామనే అనుకున్నాం, బ్యాగ్ కూడా సర్దుకున్నాను. రాత్రి ఆయనకి తిరగబెట్టింది. విపరీతమైన ఆయాసం, ఎగపోత. రాత్రంతా జాగరణే! 'నేను రాలేనుగాని నువ్వైనా వెళ్ళకపోతే వాడు బాధపడతాడేమో' అన్నారు. మనిషి మనిషిలా లేడు. తెల్లవారాక పిల్లలందర్నీ ఓసారి చూడాలనుందన్నారు. మీనాక్షమ్మ గొంతు ఆర్ద్రతాభరితమయ్యింది.

"మేం రావడంలేదని చెప్పడానికి చేసావన్నమాట"అతని ధోరణిలో మార్పులేదు.

"కాదురా ! నాకేదో భయంగా ఉంది. రేపు కదా కార్యక్రమం. ఈంలోగా ఒక్కసారి... ఒక్కసారి వచ్చి నాన్నగార్ని పలకరించిపో నాన్న ! ఎంత? మూడు గంటల్లో వచ్చేయొచ్చిక్కడికి"

"భలేదానివమ్మా! నేనిక్కడ లేకపోతే పనులన్నీ ఎవరు చూసుకుంటారు చెప్పు. నీ పిచ్చిగానీ... చుట్టాలు, ఫ్రెండ్స్ వచ్చి చేరుతున్నారు. వాళ్ళందర్నీ వదిలేసి రమ్మంటావా? అయినా నువ్వేం గాభరా పడకు. ఆయనకేం కాదు. ఇలాంటి సమయంలో ఇక్కడికి రాకుండా మంచిపని చేశారు." అంటూ క్రెడిల్ చేశాడు.

మీనాక్షమ్మ గుండె స్తంభించింది.

కొద్దిసేపు కాలం వెనక్కి మళ్ళింది-

"ఏంటీ సురేష్ ఈమధ్య కలతగా కనిపిస్తున్నాడు"

భార్యని ఆరా తీశాడు గంగాధరం.

"అన్నం కూడా సరిగ్గా తినడంలేదు" చెప్పిందామె.

"అరే... భోజనం కూడా మానేయాల్సినంత కష్టం ఏమొచ్చిందట?"

"ఆమధ్య ఏదో ఇంటర్వ్యూకి వెళ్ళాడుగా. బాగానే జరిగిందట. కానీ ఉద్యోగం వీడికి దక్కాలంటే లంచం...లంచం కావాలిట"

"నాకు చెప్పకుండా ఎలా తెలుస్తుంది?"

"వాడు నన్నడిగాడు. మిమ్మల్నే అడగమని నే చెప్పాను. జంకుతున్నాడు. ఇక లాభం లేదని నేనే మీకు చేరవేస్తున్నాను."

"సరి. పరిష్కారమయ్యేదెట్లా? నాన్న చూస్తే బడిపంతులు. డబ్బెలా ఇవ్వగలడను కున్నాడో ఏమో? వెర్రి తండ్రి, దిగులు పడొద్దని చెప్పు."

"మీకేమైనా మతిపోయిందా? అంత డబ్బెక్కడి నుండి తెస్తారు."

"అంత డబ్బంటే...ఎంతట ?"

"ఎనభైవేలట"

"పిల్లల ప్రయోజకత్వాన్ని మించి మనక్కావాల్సిందేముంది మీనాక్షీ ! తల తాకట్టు పెట్టయినా సర్దుతాను. కానీ ఈ పంతులు తలకి అంత విలువెక్కడిది ? ఇల్లుందిగా, అది తాకట్టు పెడతా. మొదటివాడు బిజినెస్‌తో సెటిలయ్యాడు. వీడైనీ ఉద్యోగస్థుడవనీ..."

అలా తాకట్టుపెట్టినవాటిని విడిపించుకోలేక... దానికైన వడ్డీ మీద వడ్డీ పేరుకుపోయి లెక్కలు కట్టగా... పెంకుటింటిని యావత్తూ... అప్పుతెచ్చిన వాడికే అప్పచెప్పాల్సి వచ్చింది. చివరికి అద్దె ఇంట్లో చేరారు.

కొడుకుఉద్యోగంకోసం తాతల నుండి వచ్చిన ఇంటిని వదులుకుని అద్దింట్లో కష్టాలు పడ్డ తండ్రి కోసం... చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న కన్న తండ్రికోసం... గృహప్రవేశం కార్యక్రమాన్ని రద్దుచేసుకోలేని సంకుచితత్వం?

ఏవయ్యా ! ఇలాంటి కొడుకుల కోసమా మన ఊపిరిని సైతం లెక్కచేయక వీళ్ళ జీవితాలకి ఊపిరిపోసింది?

ఒక వేదనా తరంగం ఆమె ఎదగదుల్లో తారట్లాడింది.

మూడో కొడుకు రమేష్‌కి ఫోన్ చేసింది. హైదరాబాద్‌లో సెటిలయ్యాడతను. ఫోన్ రింగవుతోంది కాని ఎవ్వరూ ఫోన్ లిఫ్ట్ చేయడంలేదు.

'అయ్యో! నా మతిమరుపు మండ. ఈ సమయంలో కొడుకూ, కోడలు ఆఫీసుకు వెళ్ళుంటారు కదా ! పిల్లలెప్పుడో స్కూల్‌కి బయల్దేరుతుంటారు.' అని అనుకుంటూ సెల్‌కి రింగ్ చేసింది మీనాక్షమ్మ.

"ఆ చెప్పమ్మా !" సెల్లో అడిగాడు రమేష్ లాండ్‌ఫోన్ నెంబరు గుర్తుపడుతూ, ఆమె పెదవి విప్పేలోగానే "అవునూ ? అమ్మా ! ఇంకా మీరు చిన్నన్నయ్య దగ్గరికి బయల్దేరలేదా ? రేపు గృహప్రవేశం చేస్తున్నాడట కదా ! కార్డ్ పంపాడు. రెండుసార్లు ఫోనూ చేశాడు. ఒకరోజు ముందే రమ్మని. కానీ అసలు ఫంక్షన్‌కే వెళ్ళే పరిస్థితి లేదు" అన్నాడు రమేష్.

"ఇక్కడ మాకూ అలాగే ఉందిరా. నాన్నగారి పరిస్థితి విషమించింది."

"ఇప్పుడేంటమ్మా కొత్తగా ! ఆయన మంచంలో పడి అయిదేళ్ళవలేదూ ? నీ మంగళ సూత్రం గట్టిది కాబట్టి బ్రతికున్నారింకా."

"దగ్గరుంటే చెంప చెళ్ళుమన్పించేదే! సహనం కూడగట్టుకుందా తల్లి. కొడుకులతో వాదనకి దిగడం కాదిపుడు. భర్త చివరి కోరిక తీరడం, తీర్చడం.

"ఇంకా బ్రతికున్నారు కనుకనే... తండ్రిగా ఆయన మనసు చితికి పోలేదు కాబట్టే... మిమ్మల్నోసారి చూడాలని తాపత్రయపడుతున్నారు. ఒక్కసారి వచ్చి పోనాన్నా!" చిన్నతనంలో అన్నం తినని మారాంచేసినపుడు ఎలా బుజ్జగించి, బ్రతిమిలాడిందో అలాగే ఉందిపుడు ఆ పిచ్చితల్లి వాలకం.

అపుడు చిన్నపిల్లవాడు కనక అమ్మ మాట విని, ఆమె చేతి గోరుముద్దలు తినేసాడు.

మరిప్పుడో?...

"చెప్పాను కదమ్మా ! అన్నయ్య తొలిసారిగా జరుపుకుంటున్న ఫంక్షన్‌కే వెళ్ళడం లేదు. నీ చెంతకెలా వచ్చేది ? ఆఫీసులో ఇన్‌స్పెక్షన్స్ మొదలయ్యాయి. వన్‌వీక్ దాకా ఉంటుందా గొడవ. నేనూ, మీ కోడలు ఎవ్వరిమీ లీవ్‌పెట్టే వీలులేదు. రాడవం కాదు గాని డబ్బేమైనా అవసరమైతే చెప్పు. నాఫ్రెండ్ రవిగాడికి ఫోన్ చేస్తా. అక్కడేగా వాడుంటున్నది. అడ్జస్ట్ చేస్తాడు."

"నెల నెలా పంపట్లేదూ? మీ అన్నదమ్ములు పంపే డబ్బు మా అవసరాల్ని తీరుస్తుందే మోగానీ... మా వృద్ధాప్యానికి ఆసరాగా నిలుస్తుందా?" మనసులో అనుకుంటూ...

"అక్కర్లేదురా..." అంది.

"సరేనమ్మా! ఉంటాను. పెండింగ్ వర్క్ చాలా ఉంది."

గుండెలో ముల్లు గుచ్చుకున్నట్టయ్యింది.

అసంకల్పితంగా పెనవేసుకున్న సంఘటనొకటి కనుల ముందు మెదలింది.

"ఏవండీ!" భర్తని పిలిచింది మీనాక్షమ్మ.

"చెప్పు" బదులిచ్చాడతను.

"పెద్దపిల్లలిద్దరికి చెరో వ్యాపకాలున్నాయి. పెళ్ళిళ్ళు జరిగాయి. మూడోవాడే ఎటు కాకుండా పోయాడండి. వాడి గురించేం ఆలోచించారు?"

"నాకూ అదే బాధగా ఉంది మీనూ?"

"ఏదో ఒకటి చేయ్యండి. తోటి స్నేహితులందరికీ ఉద్యోగాలయ్యాయని అదేపనిగా మదనపడుతున్నాడు వాడు." తల్లడిల్లిందా తల్లిమనసు.

"అదే ఆలోచిస్తున్నాను. వి.ఆర్.ఎస్ తీసుకోవాలని నిశ్చయించుకున్నాను. ఇంకా ఆరేళ్ళుంది నా సర్వీసు. అయిదు సంవత్సరాలముందే పదవీ విరమణ చేయొచ్చు. అప్లికేషన్ పెడతాను. నా స్థానంలో వాడికి ఉద్యోగం వస్తుంది. డిగ్రీ పూర్తయ్యిందిగా. ఏదో ఆఫీసులో క్లర్క్ జాబ్ ఇస్తారు. ఈ సమస్యకదే పరిష్కారమార్గం" భార్యకి వివరంగా చెప్పి, కొడుక్కి

ఉద్యోగం వచ్చే ఏర్పాట్లన్నీ పూర్తిచేసాడు.

తండ్రివలన వచ్చిన ఉద్యోగంలో చేరాక, ఉద్యోగమున్న అమ్మాయి రమేష్‌కి భార్య అయింది.

అలాంటిది-

మనం కరిగి వీళ్ళ జీవితాలకి వెలుగునిస్తే వీళ్ళ మనసు మాత్రం వీసమెత్తు కరగడం లేదు. కడచూపుకొరకై కనికరించడం లేదు.

కన్నపేగుల్ని చూడాలన్న మీ కడసారి కోరికని భార్యగా నే తీర్చలేకపోతున్నందుకు... పలవరిస్తున్న తండ్రి పలకరించి పొమ్మని శాసించే స్థితిలో ఈ అమ్మలేనందుకు... కరుణలేని ఇలాంటి కొడుకులకి జన్మనిచ్చినందుకు...

నన్ను క్షమించయ్యా! అశ్రుకణాలు ధారాపాతంగా ఆమె చెంపల్ని అభిషేకిస్తుంటే నిస్సహాయంగా భర్త పాదాలపై మోకరిల్లిందామె.

మూడు రోజులు గడిచాయి.

"పిల్లలింకా రాలేదెంటి మీనాక్షీ?" మాటలు కూడబలుక్కున్నాడు గంగాధరం.

"పిల్లలింకా రాలేదేంటి మీనాక్షీ?" పాతికేళ్ళ క్రితం అచ్చంగా ఇదేమాట పదవసారి భార్యని అడిగాడు గంగాధరం.

"వస్తార్లెండి. వద్దు వద్దంటే నామాట వినకుండా మారాం చేసారని అబ్బాయిల్ని ముగ్గుర్నీ వాళ్ళ స్కూల్ పిల్లల్తో ఎక్స్‌కర్షన్ పంపారు. ఇప్పుడేమో పిల్లలు రావడం ఓ పూట ఆలస్యమయిందని తెగ కంగారు పడుతున్నారు. మీరు అబ్బాయిల్ని విడిచి ఒక్క రోజుండలేరని తెలిసీ వాళ్ళని పంపొద్దని వారించాను. చుసారా మీ ఆరాటం?' అందపుడు మీనాక్షి తన ఆరాటాన్ని కప్పిపుచ్చుకుంటూ.

ఇప్పుడూ అదే ఆతృత... అదే పుత్ర వాత్సల్యం.. అదే ఎదురుచూపు.

కన్నీళ్ళ పర్యంతమైన మీనాక్షి... భర్తనేవిధంగా సమాధానపర్చాలో తెలియక ఆలోచల్నుండి తేరుకుంటూ భర్తవైపు బాధగా చూసింది.

అంతే !

"ఏవండీ!" అనరుస్తూ కుప్పకూలిపోయింది మీకిక్షమ్మ.

భార్య వేదన వినకూడదనుకున్నాడో... విని తట్టుకోలేననుకున్నాడో...

పార్థివదేహాన్ని వదలి గంగాధరం అనంత లోకాలకేగిపోయాడు.

ఆయన పెదవులు విడివడి ఉన్నాయి.

'అలసిపోయాను మీనూ!' అంటున్నట్లు.

కనురెప్పలు తెరిచే ఉన్నాయి.

'ఎదురుచూసే ఓపికిక లేదన్న'ట్లు-

ఇరుగూ పొరుగూ చేరారు. ముగ్గురు కొడుకులకి కబురువెళ్ళింది.

గంగాధరం మాష్టారు మరణంతో ఊరు ఊరంతా కన్నీరయ్యింది. అశేష శిష్యవాహిని, జనప్రవాహం మాష్టారి మృతదేహాన్ని దర్శించుకునేందుకు తరలివచ్చింది.

అబ్బాయిలు తల్లిని పట్టుకొని వల వలా ఏడ్చారు.

అప్పుడు పెదవి విప్పింది మీనాక్షమ్మ.

"వద్దు మీ నాన్నగారి కర్మకాండలు చేసే అర్హత మీకు లేదు. నెల నెలా డబ్బులు పంపుతూ చేతులు దులుపుకోవడం కాదు. వార్థక్యంలో చేరదీసి, కన్నవ్యాని ఆదరించలేని మీరు... కడచూపుకైనా కదలి రాని మీరు... మీరెందుకురా ఆయనకోసం కన్నీరు కార్చడం-మానవత్వం ఉన్నవాళ్ళు ఆ పనిచేయాలి.

మాష్టారు మంచంలో పడ్డారని, అనారోగ్యం పాలయ్యారని తెలియగానే ఎందరెందరో, ఎక్కడెక్కడి నుండో వచ్చి, ఆయన్ని పరామర్శించారు. ఆయనతో పెనవేసుకున్న జ్ఞాపకాన్ని తిరిగి పంచుకున్నారు. మాష్టారి మంచితనాన్ని కనుకొనల్లో నింపుకొని వెళ్ళి పోయారు.

అలాంటిది ఒక్కడు...ఒక్కడు కూడా కొడుకులుగా మీ నాన్నగారి గుండె తలుపుల్ని తట్టలేకపోయారు. వద్దు. మీరాయన శవాన్నే తాకొద్దు. ఆయన ఆత్మ శాంతించదు. రేపు నన్ను మీరు అక్కున చేర్చుకోలేకపోయినా ఫర్వాలేదు. వీళ్ళలో ఎవరో ఒకరు ఆ మహానుభావుడి దహన సంస్కారాలు పూర్తిచేసి పుణ్యం కట్టుకుంటారు. చరిత్రలో ఏ తల్లీ చేయనిది ఈ అమ్మమీకు విధిస్తున్న శిక్ష.

ఒక్కసారి ఆయన వంక చూడండ్రా! తనువుచాలించినా మిమ్మల్ని తనివితీరా చూడాలనే తపనతో ఆ కనులింకా మూతపడ్లేదు. మీతో మనసారా మాటాడాలనే ఆశతో ఆ పెదవులింకా మూసుకోలేదు" చెప్పడం ముగించి భర్త శవంపై కుప్పకూలిపోయింది మీనాక్షమ్మ.

ఆ అమ్మ అంతర్వేదన వెనకున్న... కొడుకుల అసలు విషయం తెలుసుకొని... నిశ్చేష్టులయ్యారక్కడివాళ్ళు.

కుంచించుకుపోయిన కొడుకులేమో తలలు వంచుకున్నారు.